కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 47, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 10–12, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సౌభాగ్యనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస రెడ్డి

అడ్డగుట్ట: గ్రంథాలయాలను అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పోచంపల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తుకారాంగేట్‌లో ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. నియోజకవర్గంలో గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి శ్రీనివాసరెడ్డితో ఎమ్మెల్యే శ్రీగణేష్ చర్చించారు.

తుది దశకు చేరిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరింది నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి మొత్తం 40,725 దరఖాస్తులను జీహెచ్ఎంసీ అధికారులు స్వీకరించారు. ఇందులో శుక్రవారం వరకు 33,670 మంది దరఖాస్తు దారులరు నుంచి సర్వేయర్లు వివరాలు సేకరించారు. అడ్డగుట్ట డివిజన్ నుంచి 10,429, తార్నాక నుంచి 8,560, మెట్టుగూడ నుంచి 4,810, సీతాఫల్‌మండి నుంచి 7,675, బౌద్ధనగర్ నుంచి 9,251 మంది ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. 20 మంది సర్వేయర్లు లబ్ధిదారుడి ఫొటో ఇతర ధృవపత్రాలు స్వీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో మొదలైన ఇందిరమ్మ గృహాల సర్వే ఈనెల 25వ తేదీ వరకు పూర్తిచేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

పార్టీ పటిష్టత కోసం పనిచేయాలి



మర్రి శశిధర్‌రెడ్డిని కలిసిన బన్సీలాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేష్

సనత్‌నగర్: నూతనంగా నియమితులైన డివిజన్ల అధ్యక్షులు పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేయాలని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి సూచించారు. బన్సీలాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన ఆర్.మహేష్ శుక్రవారం శశిధర్‌రెడ్డిని బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా డివిజన్ అధ్యక్షులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుంటి సత్యనారాయణ, కిరీట, వికాస్, నరేష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ



తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే

రసూల్‌పురా: నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్న కారణంగా గతేడాది రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య తగ్గిందని నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. శుక్రవారం నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజుతో కలసి తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనలు పాటించనివారికి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

రేషన్‌కార్డు..పేదవారి కల.. ఇది లేకపోతే ప్రభుత్వ పథకాలు అసలే రావు.. నిజమైన లబ్ధిదారులకే పథకాలు అందజేస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఏళ్ల తరబడి రేషన్ కార్డులను పంపిణీ చేయకపోవడంతో కొందరికే పథకాలు అందుతున్నాయి.. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక చురుగ్గా సాగుతుండటంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.
– సికింద్రాబాద్

రేషన్ కార్డుల జారీ కోసం సర్వే ప్రారంభం

తొలిరోజు 400 దరఖాస్తుల పరిశీలన పూర్తి | వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక

కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం చేపట్టిన దరఖాస్తు దారుల సర్వే ప్రక్రియ సికింద్రాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తు దారుల వివరాలు రాబట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పదేళ్ల అనంతరం కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బీఆర్ఎస్ ప్రభుత్వం కొద్ది సంవత్సరాల క్రితం కొత్త కార్డులజారీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో నియోజకవర్గం నుంచి వేలాదిమంది దరఖాస్తులు చేసుకున్న మీదట కార్డుల జారీ కార్యక్రమాన్ని అసంపూర్తిగా నిలిపివేశారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మళ్లీ రేషన్‌కార్డుల జారీ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. గతంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు.

8 వేల దరఖాస్తుల స్వీకరణ

- ప్రజాపాలన ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల కోసం జీహెచ్ఎంసీ అధికారులకు ఐదు డివిజన్ల నుంచి మొత్తం 21వేల దరఖాస్తులు అందాయి. ఇందులో 8 వేల వరకు దరఖాస్తులు కేవలం రేషన్ కార్డుల కోసమే అందినట్టు అధికారులు ప్రకటించారు.
- పరిశీలనల అనంతరం 3400 దరఖాస్తుల పరిశీలనకు అధికారులు నిర్ణయించారు. రేషన్ కార్డులు పొందడం కోసం అర్హత కలిగి ఉన్నట్టు అధికారులు ఎంపిక చేసుకున్న దరఖాస్తు దారుల ఇంటింటి సర్వే ప్రారంభమైంది. సిబ్బంది దరఖాస్తు దారుల ఇంటి వద్దకు వెళ్లి వాస్తవ వివరాలు రాబట్టి, నమోదు చేసుకుంటున్నారు.

సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

మొత్తం రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు	కొత్త దరఖాస్తులు	సర్వేకు ఎంపిక చేసినవి
56	48,900	5,900	3400



కొత్త రేషన్ కార్డుల జారీ కోసం వివరాలు సేకరిస్తున్న సర్వే సిబ్బంది

ఐదు బృందాల్లో 40మంది సిబ్బంది

నియోజకవర్గంలో అధికారులు, సిబ్బంది కలుపుకుని 40 మంది రేషన్‌కార్డుల సర్వే విధుల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, కార్ల తరహా వాహనాలు, 100 గజాలకు పైబడిన స్థలంలో సొంత ఇల్లు, వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు పైబడి ఉన్న దరఖాస్తు దారులను రేషన్ కార్డు పొందడం కోసం అనర్హులుగా అధికారులు పరిగణిస్తున్నారు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాత రేషన్‌కార్డులను పరిశీలిస్తున్న సర్వే సిబ్బంది వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

అర్హులనే జాబితాలో చేర్చుతాం

రేషన్‌కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడిన పరిస్థితులు కలిగి ఉన్న దరఖాస్తు దారులను మాత్రమే అర్హులైన లబ్ధిదారుల జాబితాలో చేర్చుతాం. ప్రజాపాలనలో అందిన తొలివిడతలో 3400 దరఖాస్తులను పరిశీలించి వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. దరఖాస్తు దారులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు.
– డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు, సికింద్రాబాద్ సర్కిల్

19 వరకు పీసీ సర్కార్ మ్యాజిక్ షో

రాంగోపాల్‌పేట్: హరిహర కళాభవన్‌లో నిర్వహిస్తున్న పీసీ సర్కార్ మ్యాజిక్ షో మరో రెండు రోజులు మాత్రమే కొనసాగుతుందని నిర్వాహకులు కార్తికేయన్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన మొదలైన ఈ మ్యాజిక్ షో ప్రతి శని, ఆదివారాలతో పాటు సంక్రాంతి పండుగ సందర్భంగా అదనంగా రెండు రోజులు నిర్వహించామని తెలిపారు. ఈ నెల 19న షో ముగుస్తుందని ఆయన తెలిపారు.

వాహనదారులకు అవగాహన

ఖైరతాబాద్: రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సైఫాబాద్ పోలీసులు నెక్లెస్ రోడ్డులో వాహనదారులకు లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ఏసీపీ, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ఆనంద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గాంధీ'లో సీపీఆర్‌పై ఉచిత శిక్షణ

గాంధీఆస్పత్రి : గుండెపోటు వచ్చిన సమయంలో ఫస్ట్‌ఎయిడ్‌గా భావించే కార్డియో పల్మనరీ రిసక్టేషన్ (సీపీఆర్)పై సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ భవనంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గాంధీ అలుమ్నీ భవనంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్లలో 30 వేల మందికి సీపీఆర్ ఉచిత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 19వ తేది నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే శిబిరంలో సుమారు ఐదు వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీపీఆర్ ఉచిత శిక్షణ కోసం 8179713704, 90631 82058, 9247378469 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గాంధీ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, గ్లోబల్ అలు మ్నీ ట్రస్టీ డాక్టర్ రవీందర్‌సురకంటి, సెక్రటరీ డాక్టర్ కొలిపాక రాజశేఖర్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

ట్రాఫిక్ ఉల్లంఘనులకు కౌన్సెలింగ్

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య కౌన్సెలింగ్ ఇచ్చారు. సీటీఓ జంక్షన్ వద్ద శుక్రవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ వచ్చిన వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి కౌన్సెలింగ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు.

మేధావులను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న గోవిందు నరేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు ఇస్తున్న మేధావుల పై మాల సంఘాల నేతలు విమర్శలు చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ అన్నారు. శుక్రవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్ యాదవ్, విమలక్క, దరువు అంజన్న, సయ్యద్ ఇస్మాయిల్, నల్గొండ గద్దర్, రేలారే గంగ, ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్, ప్రొ.హరగోపాల్, జయప్రకాష్ నాయరాణ, దేశపతి శ్రీనివాస్ తదితరులను మాల నాయకులు విమర్శించడం దారుణమన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యపదజాలంతో దూషించడం మానుకోవాలన్నారు.

రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పద్మారావునగర్: సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్ సమీపంలోని రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయం ముందు శుక్రవారం రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు, ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడారు. రైల్వే ట్రాక్ మెన్ ఇంజనీరింగ్ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇంజనీరింగ్ కార్మికులు ఈ నెల 24న డివిజన్ స్థాయిలో అదే విధంగా ఫిబ్రవరి 5న జీఎం కార్యాలయం ఎదురుగా పెద్ద ఎత్తున ధర్నా చేయాలని నిర్ణయించినట్లు నాయకులు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో పలువురు రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

వ్యక్తి అదృశ్యం

చిలకలగూడ: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు... మెట్టుగూడకు చెందిన లోకేష్ (30) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీనవం సాగిస్తున్నాడు. ఈనెల 16 న బయటకు వెళ్లిన లోకేష్ తిరిగి ఇంటికి రాలేదు. సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య శివనాగరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఎంజీబీఎస్ ప్రాంతానికి చెందిన అనిల్ కుమార్(45) ఈ నెల 17న ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై ఔషాపూర్‌కు వెళ్లాడు. అక్కడ చెట్ల పొదల్లో తన వాహనాన్ని నిలిపి ఔషాపూర్ – కొండమడుగు మధ్యలోని పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆస్పత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం



వనజ (ఫైల్)

అడ్డగుట్ట: మానసిక స్థితి సరిగ్గాలేని ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా తెలిపిన మేరకు.. నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన వనజ(41) లాలాగూడ రైల్వే వర్క్‌షాప్‌లోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో అటెండెర్‌గా పని చేస్తోంది. ఈ నెల 2న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. రాత్రైనా వనజ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సికింద్రాబాద్: ప్రమాదవశాత్తు రైలులోంచి పడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఈనెల 15న సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి వెళుతుండగా ఒక వ్యక్తి బోగీ నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించాడు. అయితే కాలు జారడంతో ప్లాట్‌ఫామ్‌కు, రైలుకు మధ్య ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు బాధితుడిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు గురువారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద పోలీసులకు ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. మృతుడి గురించి వివరాలు తెలిస్తే 8712658581, 9666280808 నెంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మాదిగ సంక్షేమ సంఘం సభ్యులు పలువురు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి మాణికేశ్వర్‌నగర్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏపూరి సోమన్న మాదిగ తదితరులు

రసూల్‌పురా: ఎస్సీవర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారి గుండెల్లో దండోరా మోగేలా లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి ఒక్కరూ నగరానికి రావాలని బడుగు బలహీన వర్గాల రాష్ట్ర నాయకులు ఏపూరి సోమన్న మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం బొల్లారంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన మాదిగల సమావేశానికి సోమన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమానికి లక్షలాది మంది మాదిగలు తరలిరావాలని రాష్ట్రం నలుమూలల ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఇటిక శ్రీకిషన్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి శ్రవణ్ కుమార్ మాదిగ పాల్గొన్నారు.

'గాంధీ'లో నిరుపేదలకు అన్నదానం



గాంధీఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న జగదీశ్వర్‌గుప్తా

గాంధీఆస్పత్రి : వైఎస్ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సదరన్ ట్రావెల్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక చైర్మన్ ఆలపాటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం సుమారు వెయ్యి మంది నిరుపేదలు, అన్నార్తులు, అభాగ్యులకు అన్నదానం చేసినట్లు జగదీశ్వర్‌గుప్తా తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో ఆలపాటి కృష్ణమోహన్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులకు నిబంధనల ప్రకారం పరిహారం అందజేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీచ్చారు. చిన తోకట్ట కమ్యూనిటీహాల్‌లో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు కొంతమందికి ఇబ్బంది, నష్టం జరుగుతుందని కానీ.. అందరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్ఐ మహేష్ తదితరులు

బన్సీలాల్‌పేట్: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. మహంకాళి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్ఐ మహేష్ తదితరులు పలు చౌరస్తాల్లో ప్రజలకు ట్రాఫిక్ సంబంధించిన నియమ నిబంధనలు తెలియజేశారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించిన వాహనచోదకులను అభినందించారు. ట్రాఫిక్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారు 10 మంది లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



ముగ్గులను పరిశీలిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం వెంకట్రావ్ నగర్ కాలనీ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో 54 మంది మహిళలు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

బన్సీలాల్‌పేట్‌లో గ్యార్వీ వేడుకలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డి క్లాస్‌లో శుక్రవారం ముస్లింలు గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అనేక మంది పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. నిర్వాహకులు ఆజామ్, రుక్నుద్దీన్, అబ్బాస్, ఇమ్రాన్, ఫయూమ్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ షురూ

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ క్లబ్ టెన్నిస్ కాంప్లెక్స్‌లో శుక్రవారం 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) ఎం.రమేశ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలను జీవన శైలిలో భాగం చేసుకోవటం అనివార్యమన్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 220 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారనిని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి వెల్లడించారు. టోర్నమెంట్‌లో పోటీపడే క్రీడాకారులకు ఉచిత భోజనం, బసవసతి సౌకర్యాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు.